సాక్షి నిర్మల్

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025

పీజీ సెట్‌లో ప్రతిభ



నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌కు చెందిన మేన రితీశ్ సోమవారం వెలువడిన పీజీ సెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. ఎంఎస్సీ ఫిజిక్స్‌లో రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని రైల్వే డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ పూర్తి చేశాడు.

రేపు బాసరకు మంత్రి 'జూపల్లి'



బాసర: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం బాసరకు రానున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారు. బాసరలో నిర్మించే 30 పడకల ఆస్పత్రి భవనానికి భూమి పూజ చేస్తారు. అనంతరం ఆర్జీయూకేటీ వెళ్లి విద్యార్థులను కలిసి సమస్యలపై చర్చిస్తారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశమయ్యారు. ఓటర్ జాబితాలో డబుల్ ఓటర్లు ఉండకుండా చర్యలు చేపడతామన్నారు. ఒకటి కంటే ఎక్కువ కేంద్రాల్లో ఓటరుగా ఉంటే తొలగిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 4,49,302 మంది ఓటర్లు ఉన్నారని, వారి సౌకర్యార్థం 892 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్క బూత్‌లో 700–800 మందికి మించి ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పార్టీ ప్రతినిధులను కోరారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన అనేక అంశాలపై అధికారులు సమాధానమిచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా



వర్షిణిని అభినందిస్తున్న డీఐఈవో పరశురాం

సారంగపూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీరవెల్లి గ్రామానికి చెందిన సగ్గం వర్షిణి హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్ 77 కిలోల విభాగంతో సత్తా చాటింది. యూత్ లెవల్ స్వర్ణ పతకం సాధించింది. విద్యార్థినిని డీఐఈవో జె.పరశురాం, స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు అభినందించారు.

ఉద్యోగుల మానసికోల్లాసానికి క్రీడలు



చెస్ ఆడుతున్న ఉద్యోగులు

నిర్మల్‌టౌన్: శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఉద్యోగులకు జిల్లాస్థాయి పోటీలు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చెస్, క్యారం, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్‌తోపాటు ఔట్‌డోర్ గేమ్స్ కూడా నిర్వహించారు. ప్రతీ విభాగంలో పోటీదారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. కార్యక్రమంలో పీడీలు ఎం.శ్రీనివాస్, రమణారావు, అన్నపూర్ణ, సత్తయ్య, అంబాజీ, భోజన్న, వెన్నెల, భూమన్న పాల్గొన్నారు.

పార్‌పల్లి హద్దులు చూపిస్తాం



వాహనాలను పరిశీలిస్తున్న ఆర్‌ఐలు

లక్ష్మణచాంద: పార్‌పల్లి గ్రామంలో సర్వే చేయించి గ్రామ సరిహద్దులు చూపిస్తామని తహసీల్దార్ సరిత తెలిపారు. రెండు రోజుల కిందట గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను అడ్డుకొని వాటిని గ్రామంలోకి తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సరిత, మైనింగ్ అధికారులు సోమవారం మైనింగ్ ఆర్‌ఐ ఆనంద్‌రావు, రెవెన్యూ ఆర్‌ఐ నరేందర్‌రెడ్డి పార్‌పల్లి గ్రామానికి వెళ్లారు. గ్రామస్తులతో మాట్లాడారు. మొదట తమ గ్రామ సరిహద్దులు చూపించాలని ఈ సందర్భంగా కోరినట్లు అధికారులు తెలిపారు. దీనిపై తహసీల్దార్ సరితను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఆర్‌ఐ నరేందర్‌రెడ్డిని పార్‌పల్లి గ్రామానికి పంపామని గ్రామస్తులతో మాట్లాడారన్నారు. గ్రామస్తుల విన్నపం ఉన్నతాధికారులకు నివేదించి సర్వే చేపట్టి పొట్లపల్లి(బి), పార్‌పల్లి గ్రామాల సరిహద్దులు చూపిస్తామని వివరించారు.

24గంటలు.. ఆన్‌డ్యూటీ

- రోజుల తరబడి రోడ్లపైనే..
- క్షణం తీరిక లేకుండా విధుల్లో..
- గణేశ్ ఉత్సవాల్లో.. పోలీస్ సక్సెస్
- అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్.. తదితర శాఖలూ సేవల్లోనే..
- సమష్టిగా.. 'వినాయక విజయం'



'చూడమ్మా.. బాగా చూడు.. కనిపిస్తోందా..! బంగల్‌పేట్ గణపతి ఎంత పెద్దగా ఉందో చూడు. ఇంతకుముందు చూసిన బుధవార్‌పేట్ గణపతి కూడా చాలా పెద్దగా ఉంది కదా బేటా..! ఇంకా చాలా చూపిస్తా బేటా.. అప్పటి వరకు అమ్మ నీకు అన్నం తినిపిస్తుంది ఓకేనా..!!' అంటూ వీడియోకాల్‌లో ఆ తండ్రి చెబుతుండగా.. 'అది కాదు నాన్నా.. నువ్వు ఇంకెప్పుడు ఇంటికొస్తవ్. అమ్మను, అన్నయ్యను, నన్ను ఎప్పుడు బయటికి తీసుకెళ్లి గణేశ్‌లను చూపిస్తవ్. మా ఫ్రెండ్స్ అందరూ వాళ్ల అమ్మనాన్నలతో టూత్రీ టైమ్స్ వెళ్లారు. ఇప్పుడు కూడా అందరూ గణేశ్‌లను చూడటానికే వెళ్లారట. నువ్వేమో ఇంకా రావట్లేదు. అమ్మను అడిగితే.. ఇలా.. వీడియోకాల్‌లో నిన్ను, గణేశ్‌లను చూపిస్తోంది..' అంటూ ఆ చిన్నారి అలా మాట్లాడుతుంటే.. కరుకు ఖాకీ డ్రెస్‌లో ఉన్న ఆ నాన్న కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి. వెంటనే తేరుకుంటూ..'వస్తా బేటా.. వస్తా.. నువ్వు తిను..' అంటూ అయిష్టంగానే ఆ వీడియోకాల్ కట్‌చేశాడు. తన విధిలో నిమగ్నమయ్యాడు.



రాత్రి 2 గంటలకు భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

నిర్మల్: తమ కుటుంబాలకు దూరంగా జిల్లా పోలీసులు రోజులతరబడి రోడ్లపైనే డ్యూటీ చేశారు. తమ సంతోషాలనూ పక్కనపెట్టి శాంతిభద్రతలను కాపాడారు. చివరి రెండురోజులైతే కనురెప్ప వాల్చకుండా 'ఖాకీలు' పనిచేయడం వల్లే జిల్లాలో గణేశ్ నవరాత్రులు విజయవంతంగా ముగిశాయి. ఒక్క పోలీసుశాఖనే కాదు అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్, వైద్య తదితర శాఖలన్నీ సమష్టిగా పనిచేసి ఈ ఏడాదీ వినాయక ఉత్సవాలను విజయవంతం చేశాయి.

పోలీసులకు పెద్దటాస్క్..

రాష్ట్రంలోనే సున్నిత ప్రాంతంగా పేరున్న నిర్మల్ జిల్లాలో వినాయక ఉత్సవాల నిర్వహణ అంటే కత్తిమీదసాము లాంటిది. గత ఘటనలను దృష్టిలో పెట్టుకుంటూ.. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, అన్నివర్గాలనూ సంతృప్తిపరుస్తూ, ప్రశాంతంగా ఉత్సవాలు ముగించడం పోలీసుశాఖకు అతిపెద్ద టాస్క్. ఎస్పీ జానకీషర్మిల ఈసారి కూడా పకడ్బందీగా వ్యవహరించారు. నవరాత్రులతోపాటు నిమజ్జనోత్సవ శోభాయాత్రలనూ విజయవంతంగా పూర్తిచేశారు. ఉత్సవాల్లోనూ ప్రజలతో కలిసిపోతూ.. అన్నివర్గాల నుంచి భేష్.. అనిపించుకున్నారు. వినాయక ఉత్సవాల విజయంలో అన్నిశాఖల భాగస్వామ్యం ఉన్నప్పటికీ ప్రధానంగా రోజుల తరబడి రోడ్లపైనే బందోబస్తులో ఉండి, శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడ్డ పోలీసుల పాత్రపై ప్రశంసలు కురుస్తున్నాయి.

అన్ని శాఖలు కలిసి..

గణేశ్ ఉత్సవాల ప్రారంభానికి నెల ముందు నుంచే జిల్లాలో అధికార యంత్రాగానికి పనిమొదలవుతుంది. ఈసారి కూడా రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్, వైద్య తదితర శాఖలన్నీ వినాయక ఉత్సవాల ప్రారంభానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నాయి. మండపాలకు పర్మిషన్లు, విద్యుత్ కనెక్షన్లు, వేలాడుతున్న తీగల తొలగింపు, మంచినీటి వ్యవస్థ, రూట్‌మ్యాప్, నిమజ్జనం వద్ద ఏర్పాట్లు.. ఇలా ఎవరి పనులను వారు విభజించుకుని, సమష్టిగా ఉత్సవాల విజయవంతానికి పాటుపడ్డారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఉత్సవాల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పోలీస్.. సక్సెస్..

వినాయక ఉత్సవాల సమయంలోనే చిన్నపాటి ఘర్షణ జిల్లాలో అల్లర్లు, కర్ఫ్యూల వరకు దారితీసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈక్రమంలో అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసుశాఖ ఈసారీ జాగ్రత్త పడింది. శాఖాపరంగా ప్రతీ నంబర్ గణపతి వద్ద 24 గంటలపాటూ నిఘా ఉండేలా కానిస్టేబుళ్లు అక్కడే ఉంటూ విధులు నిర్వర్తించారు. ఉదయం, రాత్రివేళల్లో వారిపై పర్యవేక్షణతోపాటు ప్రతీ గణేశ్ మండపం వద్దకు పోలీసులు అధికారులు గస్తీ తిరిగారు. చాలాచోట్లకు ఎస్పీ స్వయంగా వెళ్లి పర్యవేక్షించారు. ఇక ఈనెల 2న ముధోల్ నుంచి ప్రారంభమైన నిమజ్జనోత్సవాలు వరుసగా కొనసాగాయి. భైంసాలో 4న, నిర్మల్‌లో 6న నిర్వహించారు. దాదాపు వారంరోజుల నుంచి కంటిమీద కునుకు లేకుండా, రోడ్లపైనే నిల్చుని పోలీసులు సమర్థవంతంగా విధులు చేపట్టారు. నిర్మల్‌లో చివరి రెండురోజులు.. 48 గంటలు ఆన్ డ్యూటీలోనే ఉండి భేష్ అనిపించుకున్నారు.

అటు వరదలు.. ఇటు ఉత్సవాలు..

ఈ నెలరోజుల వ్యవధిలోనే ఓ దిక్కు భారీవర్షాలు, పోటెత్తిన వరదలు బెంబేలెత్తించాయి. జిల్లా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాయి. వాతావరణ శాఖ నివేదికలతో వారం పదిరోజులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గోదావరిలో చిక్కుకుపోయినవారిని కాపాడేందుకూ గంటల తరబడి వేచిఉండాల్సి వచ్చింది. వరద మిగిల్చిన నష్టాన్ని అంచనా వేయడం ఒకెత్తు. అలా భారీవర్షంలోనే వినాయక చవితి వచ్చేసింది. ఇటు వరదలు, అటు నవరాత్రులు రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ జిల్లా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు.

సమష్టిగా పనిచేయడంతోనే..



జిల్లా అధికార యంత్రాంగం, సిబ్బంది సమష్టిగా పనిచేయడం, జిల్లా ప్రజలందరి సహకారంతోనే వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా పూర్తిచేసుకున్నాం. భైంసా, నిర్మల్‌లోనూ శోభాయాత్రలు ప్రశాంతంగా పూర్తిచేయగలిగాం. రోజుల తరబడి ప్రతీ పోలీసు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పనిచేశారు. –డా.జానకీషర్మిల, ఎస్పీ

'ప్రజా' ఫిర్యాదులపై స్పందించాలి

- సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు
- కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు స్పందించాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్ ఆర్డీవో రత్న కళ్యాణితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు ఆదేశించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలనీ సూచించారు. ఈనెల 10న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన ఉన్నందున అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

శాంతియుతంగా గణేశ్ ఉత్సవాలు..

జిల్లాలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా ముగిశాయని కలెక్టర్ తెలిపారు. ఆదివారం రాత్రి వరకు సాగిన వినాయక నిమజ్జన కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా పూర్తయిందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, గణేశ్ కమిటీలు, స్వచ్ఛంద సేవాసంస్థలు, మీడియా ప్రతినిధులకు ఆమె కతజ్ఞతలు తెలిపారు.

ఇసుకకు అనుమతి ఇవ్వాలి..



మామడ మండలం వాస్తాపూర్, రాంపూర్ గ్రామాలకు 95 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు బేస్మెంట్ వరకు ఈ ఇళ్లు నిర్మించాం. 15 రోజుల నుంచి ఇసుక కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. పెంబి మండలం నుంచి ఇసుక తేవడానికి అనుమతి మంజూరు చేయాలి.

– వాస్తాపూర్, రాంపూర్ గ్రామస్తులు

జీతాలు విడుదల చేయాలి...



ఐదు నెలల నుంచి మాకు జీతాలు రావడం లేదు. అంతేకాకుండా 17 ఏళ్లుగా 104లో ఉద్యోగం చేస్తున్నాం. జీతాలు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. కరోనా సమయంలో కూడా ప్రాణాలకు తెగించి వైద్య సేవలను అందించాం. మా ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలి.

– 104 సిబ్బంది కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి..



జిల్లా కేంద్రంలోని సిద్ధాపూర్ సోఫీ నగర్ ప్రాంతంలో ఉన్న చెరువు సుమారు 38.08 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును కొంతమంది ఆక్రమించి మట్టితో పూడ్చి ప్రహరీ నిర్మిస్తున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోతుంది. ఇది పర్యావరణానికి స్థానిక ప్రజల నీటి అవసరాలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది.

– ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

డబ్బులు ఇప్పించండి..



మాది దిలావర్‌పూర్. నా భార్య మంజుల క్యాటరింగ్ చేస్తుంది. 2022లో న్యూ పోచంపాడ్ గ్రామంలో జరిగిన పల్లె ప్రగతి కార్యక్రమాని నా భార్య భోజనాలు పంపింది. ఈ క్యాటరింగ్‌కు సంబంధించిన రూ.80 వేలు ఇప్పటివరకు రాలేదు. ప్రస్తుతం మా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మా డబ్బులు ఇప్పించండి. – సాయిరాం

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలి

- ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి నాగభూషణం



నిరసనలో దివ్యాంగులు, వితంతువులు

నిర్మల్ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేసి దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి నాగభూషణం డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇస్తామన్న రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, నేత, గీత ,బీడీ కార్మికులకు, డయాలసిస్, హెచ్‌ఐవీ రోగులకు ఇస్తామన్న రూ.4 వేల పెన్షన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 150 నుంచి 200 పనిదినాలు కల్పించి, తేలిక పనులు ఇవ్వాలన్నారు. వివాహ ప్రోత్సాహక బహుమతులు రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 18 నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదని తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాజు, జనరల్ సెక్రెటరీ భోజారెడ్డి, గౌరవ అధ్యక్షుడు పి.రాజు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నందకుమార్, సాయిచంద్, శనిగారపు రవి, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లాలో ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు, ఆస్తులు నష్టపోయినవారికి పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ అన్నారు. ఈమేరకు బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ.. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. కొట్టుకుపోయిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. కడెం ప్రాజెక్టు వరద ప్రభావంలో కొట్టుకుపోయిన కడెం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి గంగాధర్ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రాంనాథ్ , పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'లంబాడాలు ఎస్టీలు కాదు'



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సోయం బాపూరావు

కడెం: లంబాడాలు ఎస్టీలు కాదని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు ఇస్తుందని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయంబాపూరావు అన్నారు. మండలంలోని నర్సాపూర్ గొండుగూడలో సోమవారం నిర్వహించిన రాజ్‌గోండ్ సేవా సమితి గోండ్వానా పంచాయతీ రాయి సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాలు ఎలాంటి నివేదికలు ఇచ్చిన లంబాడాలు ఎస్టీలు కాదని సుప్రీంకోర్టు తీర్పునిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదివాసీలంతా తమ దేవతలైన జంగుబాయి, పెర్సాపేన్‌ను మొక్కాలన్నారు. ఇందులో గొండ్వానా గోండు మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం అర్జున్, ప్రధాన కార్యదర్శి విషంరావు, ఆనంద్‌రావు, కురం శ్యాంరావు, మోతీరాం, వెడ్మ కొద్దు, గుణవంత్‌రావు, నరసింహారావు, రాజేశ్వర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ వచ్చింది.. వసతులు తెస్తోంది..

- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక నదుపాయాలు
- తొలగుతున్న విద్యార్థుల కష్టాలు
- జిల్లాలో 20 పాఠశాలలు ఎంపిక



పీఎంశ్రీలో ఎంపిక చేసిన లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల

లక్ష్మణచాంద: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా' (పీఎంశ్రీ) పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక వసతులతో కార్పొరేట్ పాఠశాలల్లా మారుతున్నాయి. ఈ పథకం కింద జిల్లాలోని 20 పాఠశాలలు ఎంపికై, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాలను అందిస్తున్నాయి.

వినూత్న విద్యా విప్లవం..

పీఎంశ్రీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించి, విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో విద్యా అనుభవాన్ని అందించడానికి కృషి చేస్తోంది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలు అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

ఎంపికైన పాఠశాలలు..

జిల్లాలో లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాసర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దేగాం ఉన్నత పాఠశాల, దిలావార్‌పూర్ ఉన్నత పాఠశాల, కడెం ఉన్నత పాఠశాల, తానూర్ ఉన్నత పాఠశాల, కొరిటికల్ ఉన్నత పాఠశాల, జుమ్మరత్‌పేట్ ఉన్నత పాఠశాల, బూరుగుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, కేజీబీవీ దస్తురాబాద్, కేజీబీవీ కుబీర్, తెలంగాణ మోడల్ పాఠశాల కుంటాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు (ఎల్లాపూర్, ముధోల్, లెఫ్ట్‌పోచంపాడ్, జామ్), ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు (కుబీర్, ఈద్‌గాం, ఓవైసీనగర్) ఈ పథకంలో ఎంపికయ్యాయి.

కార్పొరేట్ స్థాయిలో..

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మారుతున్నాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, తరగతి గదుల లేమి, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పీఎంశ్రీ పథకం ద్వారా ఈ సమస్యలు తొలగిపోతున్నాయి. పాఠశాలల్లో కొత్త తరగతి గదుల నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు, సైన్స్ ల్యాబ్‌ల నిర్మాణం, బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి.

డిజిటల్ విద్య..

పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే, ఆసక్తికరమైన అభ్యాస అనుభవం లభిస్తోంది. ఒక్కో పాఠశాలకు 10 కంప్యూటర్లు అందించడం, డ్యూయల్ డెస్క్ బెంచీలు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యాలు విద్యార్థుల సౌకర్యాన్ని పెంచుతున్నాయి. అదనంగా, పాఠశాల ఆవరణలో పచ్చదనం, అలంకరణ మొక్కలు, ఆకర్షణీయమైన గేట్లు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు..

పాఠశాలల్లో స్థాపించిన పోస్టర్లు విద్యార్థులను ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, కఠిన శ్రమతో అవి సాధించే దిశగా ప్రోత్సహిస్తున్నాయి. ''నిన్ను నీవు నమ్మి, లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించకు'' వంటి సందేశాలు విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతున్నాయి. అదనంగా, ఎకో, యూత్ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా విద్యార్థులు సామాజిక బాధ్యతలను, జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. విద్యార్థుల అభ్యాసన అనుభవాన్ని సుసంపన్నం చేసేందుకు హైదరాబాద్, నిజామాబాద్, నిర్మల్ వంటి ప్రాంతాలకు విహార యాత్రలు, గ్రీన్ గార్డెన్‌లకు ఫీల్డ్ ట్రిప్స్ నిర్వహిస్తున్నారు. ఇవి విద్యార్థులలో సృజనాత్మకత, పర్యావరణ అవగాహన, ఆలోచనా శక్తిని పెంపొందిస్తున్నాయి.

మౌలిక సదుపాయాలు



జిల్లాలో పీఎంశ్రీ పథకంలో 20 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల్లో అదనపు గదులు, సైన్స్ ల్యాబ్‌లు, డ్యూయల్ డెస్కు బెంచీలు, మూత్ర శాలలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటివి సమకూరుతున్నాయి. – భోజన్న, డీఈవో, నిర్మల్

హరిత పాఠశాలలుగా మార్పు..



తరగతి గదుల ఎదుట ఏర్పాటు చేసిన అలంకరణ మొక్కలు

పీఎంశ్రీ పాఠశాలలు హరిత పాఠశాలలుగా రూపొందుతున్నాయి. పాఠశాల గేటు వద్ద సైకస్, రాయల్ పామ్, అరకేరియా, రామబాణం, జిరేనియం, కాజురైనా, తూజా వంటి అలంకరణ మొక్కలు, తరగతి గదుల చుట్టూ ఏర్పాటు చేసిన భారీ వృక్షాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈ హరిత వాతావరణం విద్యార్థులకు సానుకూల ఆలోచనలను, పర్యావరణ స్పృహను కలిగిస్తోంది. హరిత పాఠశాలల ఏర్పాటు ద్వారా విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెరుగుతోంది. గ్రీన్ గార్డెన్ ఫీల్డ్ ట్రిప్స్ ద్వారా విద్యార్థులు పర్యావరణ రక్షణ యొక్క ప్రాముఖ్యతను ఆచరణాత్మకంగా నేర్చుకుంటున్నారు.

క్లుప్తంగా

13న చదరంగం పోటీలు

మందమర్రిరూరల్: పట్టణంలోని బురుదగూడెంలో ఉన్న లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఈ నెల 13న ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అండర్–15 విద్యార్థులకు చదరంగం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనుకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 6305502409 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

తానూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జాదవ్ దినేష్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. బాధితుడు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న దొంగలు ఇంటి వెనుక నుంచి లోనికి చొరబడి బీరువాలో ఉన్న ఒకటిన్నర తులాల నకలేష్, 5 గ్రాముల చెవి కమ్మలు,7 తులాల వెండి, రూ.30 వేల నగదు అపహరించారు. సోమవారం దినేష్ ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉంది. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై షేక్ జుబేర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అన్నపై హత్యాయత్నం చేసిన తమ్మునికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భూ పంచాయతీ విషయంలో అన్నపై హత్యాయత్నం చేసిన తమ్మునికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు జడ్జి శ్రీవాణి సోమవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయాల అధికారి డల్లు సింగ్ తెలిపారు. 2022లో లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామానికి చెందిన జాడ రజనీకాంత్ భూమి విషయంలో అన్నతో గొడవపడి కత్తితో దాడి చేశాడు. బాధితుని భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన ఐదుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మతసామరస్యాన్ని దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టణానికి చెందిన కొండ గణేశ్, గౌతమ్, వాగ్మారే ప్రశాంత్, ఎం.మునీశ్వర్, మహేష్ ఎమ్మెల్యేతో పాటు అధికారులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా వాట్సాప్‌లో పోస్టులు పెట్టారని పేర్కొన్నారు. వీటిని గ్రూపుల్లో షేర్ చేసి గొడవకు దారితీసేలా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి పోస్టులు పెట్టినా, షేర్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లతో పాటు పోస్టులను షేర్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

దాడికి పాల్పడిన ఆరుగురిపై..

బాసర: చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో దంపతులపై దాడికి పాల్పడిన ఆరుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బాసర మండలంలోని టాక్లి గ్రామానికి చెందిన పోసాని, రాజన్న దంపతులు చంద్రగ్రహణం రోజున చేతబడి చేసిన కారణంగా తమ కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురయ్యారన్న అనుమానంతో అదే గ్రామానికి చెందిన గంగామణి, మారుతి, పోతన్న, పోసానిబాయి, మల్లేష్, లింగన్న వారిపై దాడికి పాల్పడ్డారు. దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ భాష.. యాసే శ్వాస

- ప్రాంతీయ మాండలికంతోనే భాషకు మనుగడ
- భాష, యాసలో ప్రత్యేకత కనబర్చుతున్న సాహితీవేత్తలు
- నేడు తెలంగాణ భాషా దినోత్సవం

తెలంగాణ యాసలో జిల్లా కవుల రచనలు కొన్ని...

'అవును...నేను ఆదిలాబాదోన్నే', మట్టిగోడలు, స్వేచ్ఛకు సంకెళ్లు, పత్తిపూలు, కచ్చురం, అడవి(నవల), కొలిమి అంటుకుంది, నిరుదు కురిసిన కళ, జంగూబాయి.



బాల రచయితలతో తెలుగుభాషోపాధ్యాయుడు కొండూరి పోతన్న

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మాతృభాష ప్రాధాన్యతను చాటేలా తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, జానపద గేయాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాచీన చరిత్ర కలిగి ఉంది. సామాన్యుడి భాష, యాస ద్వారా సమస్యలపై గళం విప్పిన కాళోజీ స్ఫూర్తితో జిల్లాకు చెందిన పలువురు తెలుగు భాషోపాధ్యాయులు, కవులు, సాహితీవేత్తలు, బాలరచయితలు ప్రత్యేకత కనబర్చుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో స్థానిక భాషల్లో వైవిధ్యం కనిపిస్తుంది. వివిధ రకాల యాసలతో పాటు భాషా మాండలికాలు వాడుకలో ఉన్నాయి. జిల్లాకు చెందిన కవులు కూడా తమ రచనల్లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణ భాష పరిరక్షణకు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 9న సహజకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఏటా తెలంగాణ భాషాదినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం..

వ్యవహారికమే భాషకు ఆయువుపట్టు...

తెలంగాణ భాషకు స్థానిక ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషనే ఆయువుపట్టుగా ఉంటుంది. తెలంగాణ యాసలో 'అవును..నేను ఆదిలాబాదోన్నే' అనే కవిత సంకలనాన్ని జిల్లాకు చెందిన సాహితీవేత్త అప్పాల చక్రధారి రచించారు. వందలాది మందితో మమేకమయ్యే సందర్భంలోనే భాషకు ఉన్న విభిన్న కోణాలు తెలుసుకోగలుగుతామని ఆయనంటారు. కవులు, రచయితలు తెలంగాణ యాస, భాష ప్రతిబింబించే రచనలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా తెలంగాణ భాషను ముందు తరాలకు అందివ్వగలుగుతారు. ఉమ్మడి జిల్లా నుంచి అనేకమంది కవులు, రచయితలు వర్ధమాన సాహితీవేత్తలు ఇందుకు తమ స్థాయిలో పాటుపడుతున్నారు. నేరెళ్ల హనుమంతు, తుమ్మల దేవరావు, దామెర రాములు, మడిపెల్లి రాజ్‌కుమార్, అల్లం రాజయ్య, వసంత్‌రావు దేశ్‌పాండే, మురళీధర్, చంద్రమౌళి, సామల రాజవర్ధన్, పోలీస్ భీమేశ్, ఉదారి నారాయణ, తదితర అనేకమంది ఇదే కోవలోకే చెందినవారు కావడం విశేషం.

కవిత్వం సంక్షిప్తం...అర్థం అనంతం

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ఉపాధ్యాయులు పత్తి శివప్రసాద్ రచన ప్రత్యేకశైలి సంతరించుకుని ఉంటుంది. తెలంగాణ యాసలో సంక్షిప్త పదాలతో కూడిన వచన కవిత్వంలో వీరిది అందవేసిన చేయి. చిన్న చిన్న వాక్యాలు, పదాల్లో అనంతమైన అర్థం దాగి ఉండేలా వీరి రచనలు ఉంటాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పదవీ విరమణ పొందిన ఆయన కొన్నేళ్లుగా అవిశ్రాంత సాహితీసేవలో కొనసాగుతున్నారు. ఎనిమిది మాసాలుగా ప్రతీరోజు వీరి కలం వెంట విరిచితమవుతున్న రచనలు పలు సామాజిక మాధ్యమాల్లో సాహితీ అభిమానులు ఇష్టపడుతున్నారు.

చిట్టి రచనల్లో గట్టి అర్థం స్ఫూరించేలా...

నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తెలంగాణ గ్రామీణ జీవన నేపథ్యం యాస, భాష, నుడికారాలతో కూడిన కథల సంపుటిని సమష్టిగా రచించి ఏడాది క్రితం పుస్తకంగా విడుదల చేశారు.. తాజాగా మరి కొంతమంది విద్యార్థులు 'అంకురాలు–2' పేరిట మరో పుస్తకాన్ని విడుదల చేసేందుకు శ్రమిస్తున్నారు.. అక్కడి తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్న మార్గనిర్దేశంలో చిన్నారులంతా కలిసి తెలంగాణ భాష, సంస్కృతిపై వారికున్న మక్కువతోనే కథల సంపుటిని రచించి త్వరలో పాఠకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు పూర్తి చేస్తున్నారు. గతంలో విడుదల చేసిన తొలి కథల సంపుటిలో చక్కని గ్రామీణ నేపథ్యంతో కూడిన ఇతివృత్తాలను కథాంశాలుగా స్వీకరించి తెలంగాణ యాస, సంభాషణలను గ్రామీణ రైతుల కష్టాలు, జీవనవిధానం స్ఫూరించేలా చేసిన వీరి రచనలు రాష్ట్రస్థాయిలో పలువురు రచయితలు, సాహితీవేత్తల ప్రశంసలు పొందాయి.

గ్రామ పొలిమేరలోనే వాహనాలు



వాగుకు అవతల నిలిపిఉంచిన ద్విచక్ర వాహనాలు



గౌరపూర్, చిత్తబట్ట గ్రామాల మధ్యలో వాగు

ఇంద్రవెల్లి: మండలంలోని గౌరపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గౌరపూర్, చిత్తబట్ట గ్రామాలకు మధ్యలో ఉన్న వాగుపై వంతెన నిర్మించకపోవడంతో వర్షాకాలంలో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలల పాటు తమ ద్విచక్ర వాహనలు, ఆటోలను వాగుకు అవతల ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటువైపు వ్యవసాయ భూములున్న రైతులు, గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్నారు. వాగుపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చిత్తబట్ట వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

అర్జీదారుల దరఖాస్తులు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం పీవో చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆసిఫాబాద్‌కు చెందిన నిఖిల్ ల్యాప్‌టాప్ ఇప్పించాలని, సోనాల మండలం దేవునాయక్ తండాకు చెందిన లక్ష్మణ్ ఆర్వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని, తాండూర్‌కు చెందిన విజయలక్ష్మి ట్రైకార్ రుణం ఇప్పించాలని, నార్నూర్ మండలం కొలాంగూడకు చెందిన జంగు టెంట్ హౌజ్ కోసం, గాదిగూడకు చెందిన శిరీష ఇల్లు మంజూరు కోసం అర్జీలు సమర్పించారు.

ల్యాప్‌టాప్‌లు పంపిణీ

ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రతిభ కనబర్చిన ఉట్నూర్ మండలంలోని ఎనిమిది మంది గిరిజన విద్యార్థులకు సోమవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసినట్లు పీవో తెలిపారు.

11న ఇన్‌చార్జి మంత్రి 'జూపల్లి' పర్యటన

కైలాస్‌నగర్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 11న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం నిర్మల్ నుంచి బోథ్‌కు చేరుకుని ఇందిరమ్మ మోడల్ ఇంటిని ప్రారంభిస్తారు. పరిచయ గార్డెన్‌లో వివిధ సంక్షేమ పథకాల కింద ఎంపికైన నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. ఇంద్రవెల్లికి చేరుకుని అమరవీరుల స్థూపాన్ని ప్రారంభిస్తారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. మధ్యాహ్నం భోరజ్ మండలం పిప్పర్‌వాడకు చేరుకుని ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి గిమ్మకు చేరుకుని రూ.13.78 కోట్ల సీఆర్ఆర్, ఎస్‌సీపీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తారు. పట్టణంలోని గాయత్రీ గార్డెన్‌లో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

సినీ ఫక్కీలో దాడికి యత్నం

- ముగ్గురిపై కేసు నమోదు



సైకిల్ గేర్‌విల్‌తో తయారు చేసిన ఆయుధం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో కొందరు యువకులు సినీ ఫక్కీ తరహాలో దాడి చేసేందుకు యత్నించారు. బాధితులు పారిపోవడంతో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. టూటౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు ఈనెల 6న ఆదిలాబాద్ పట్టణంలోని కోలిపూరకు చెందిన గణేశ్ మండలి సభ్యులు గ్రూప్‌గా విడిపోయి పరస్పరం దాడికి పాల్పడ్డారు. సోమవారం కోలిపూరకు చెందిన ఆకుల నితీష్ అలియాస్ టిక్కు, కారింగుల సాయికిరణ్, పరివార్ మణికంఠ అదే కాలనీకి చెందిన కళ్యాణ్, మురార్కర్ నవీన్, కార్తీక్‌తో పాటు పలువురిపై దాడి చేసేందుకు సింహాద్రి సినిమా మాదిరి సైకిల్ గేర్‌విల్‌తో తయారు చేసిన ఆయుధంతో వెళ్లారు. గమనించిన బాధితులు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మురార్కర్ నవీన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కారింగుల సాయికిరణ్, పరివార్ మణికంఠలను అరెస్టు చేయగా ఆకుల నితీన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఈ ఆయుధాన్ని తయారు చేసిన వ్యక్తిపై సైతం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తల్లిపై కుమారుడు హత్యాయత్నం

- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

తిర్యాణి: తల్లిపై కుమారుడు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తలండి గ్రామానికి చెందిన పులి భీమయ్యకు తన కుటుంబంతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తరచూ కుటుంబ సభ్యులతో భీమయ్య గొడవకు దిగేవాడు. ఆస్తికి అడ్డంగా ఉన్న తల్లి కాంతను చంపాలనే ఉద్దేశంతో ఈనెల 7న తెల్లవారు జామున ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యాడు. అప్రమత్తమైన వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. కాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం భీమయ్యను అదుపులోకి తీసుకుని ఆసిఫాబాద్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు...

అన్నారం బ్యారేజీలో ఒకరు గల్లంతు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం బ్యారేజీలో డోంగ (నాటు పడవ) బోల్తా పడి ఒకరు గల్లంతైనట్లు పట్టణ సీఐ దేవేందర్‌రావు తెలిపారు. మహారాష్ట్రలోని సిరోంచ తాలుకా మండలపురం గ్రామానికి చెందిన తూముకూరి కిష్టస్వామి, గడ్డం వెంకటేశ్ సోమవారం చెన్నూర్ మండలంలోని పొక్కూరు గ్రామానికి చెందిన చొంక సంపత్ వద్ద డోంగ (నాటు పడవ) కొనుగోలు చేశారు. అదే పడవపై ఇద్దరూ కలిసి గోదావరి నదిలో వెళ్తుండగా సుందరసాల సమీపంలోని అన్నారం బ్యారేజీ వద్దకు రాగానే నీటి ప్రవాహం ఎక్కువై పడవ తలకిందులై కొట్టుకు పోయింది. పడవలో ప్రయాణిస్తున్న కిష్టస్వామి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా వెంకటేశ్ బ్యారేజీలో గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం

రెబ్బెన: భార్య కాపురానికి రావడంలేదని భర్త బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు ఇందిరానగర్‌కు చెందిన వడ్లూరి ఓదానందం (32)కు మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ధర్మారావుపేటకు చెందిన శైలజతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు ఉన్నాడు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో రెండు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం తన భార్యకు నచ్చజెప్పి తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులతో కలిసి అత్తారింటికి వెళ్లాడు. నిరాకరించిన శైలజ తన తల్లితో కలిసి వారిని దుర్భాషలాడింది. ఇంటికి వచ్చి రాత్రి భోజనం చేసిన అనంతరం గదిలోకి వెళ్లాడు. సోమవారం ఉదయం గది తలుపు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేరకు శైలజతో పాటు ఆమె తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెరుచుకున్న బాసర ఆలయం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

బాసర: రాహుగ్రస్త చంద్రగ్రహణం అనంతరం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సోమవారం ఉదయం 4 గంటలకు తెరిచారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, మహాసంప్రోక్షణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుప్రభాతం, విశేష అభిషేకం, మహా నివేదన, మంత్రపుష్పం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులకు అన్ని అర్జిత సేవలు, సర్వ దర్శనాలు తిరిగి ప్రారంభమయ్యాయి.

పోటీ పరీక్షల సాధనకు ప్రత్యేక శిక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర: యంత్రశాస్త్ర పోటీ పరీక్షల సాధన పరిషత్ (ఏస్ ఇంజనీరింగ్ అకాడమీ) సహకారంతో యంత్రశాస్త్ర పట్టభద్రుల యోగ్యతా పరీక్ష (గేట్)) అంతర్జాల శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు బాసర ఆర్జీయుకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ అకాడమీ వ్యవస్థాపకులు చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ గోపాలకృష్ణమూర్తి అంకితభావంతో ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గేట్ శిక్షణా కార్యక్రమాలను అందించడానికి ఏ.సీ.ఈ.అకాడమీ ఒక విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం కావడం ఇదే మొదటిసారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మురళి దర్శన్ (ఓఎస్డీ), డాక్టర్ చంద్రశేఖర్ (అసోసియేట్ డీన్ కోఆర్డినేటర్) ప్రొఫెసర్ విఠల్ (అసోసియేట్ డీన్, సైన్సెస్) వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బాసర గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

బాసర: బాసర మండలం సాలపూర్ సమీపంలోని గోదావరి నదిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పూర్తిగా కుళ్లిపోయి గుర్తించలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆచూకీ తెలిసిన వారు బాసర పోలీసులను సంప్రదించాలని కోరారు.

నవజాత శిశువు మృతి

భీంపూర్: మండలంలోని భగవాన్‌పూర్‌లో నవజాత శిశువు మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ప్రియాంకకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో అంబులెన్స్ రావడంలో ఆలస్యమైంది. దీంతో మహిళ ఇంటివద్దే ప్రసవించగా శిశువు మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుమార్గాన్ని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న జక్కుల అశ్విన్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈనెల 7న గోలేటిలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 4వ సబ్ జూనియర్ బాలబాలికల అండర్–14 పోటీల్లో ప్రతిభ కనబరిచి జనగామ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సదరు విద్యార్థిని సోమవారం అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ జిల్లా కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మందమర్రి సీఐఎస్ఎఫ్ బరాక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 2వ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో సదరు పాఠశాల విద్యార్థినులు అశ్విత, పి.నేహ, ఆర్.మనస్విని స్వర్ణ పతకాలు, బి.సింధు, ఎస్. కీర్తన, బి.అక్షర, హన్విత, లౌక్యశ్రీలు రజత పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సదరు విద్యార్థులను, కరాటే మాస్టర్ రవిని ప్రిన్సిపాల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిర్మల్ కలెక్టర్ కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకంపై మబ్బులు..



వెండి మబ్బులు

మొన్నటి వరకు కారుమబ్బులు కలవరపెట్టాయి. ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో నీలి ఆకాశంలో వెండి మబ్బులు కనువిందు చేస్తున్నాయి. సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ వద్ద కనిపించిన పాల నురగలాంటి మేఘాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వెండి మబ్బుల మాటున త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



జిల్లా కేంద్రంలోని సీతసాగర్ చెరువుపై మబ్బుల కనువిందు..

పాముకాటుతో మహిళ..



జానాబాయి (ఫైల్)

వాంకిడి: పొలం పనులకు వెళ్లిన ఓ మహిళను పాము కాటువేయడంతో మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన వడ్డురే జానాబాయి(34), శంకర్ దంపతులు ఆదివారం పంటచేనుకు వెళ్లారు. సాయంత్రం పనులు చేస్తుండగా జానాబాయిని పాముకాటు వేసింది. ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్..



గంగాధర్ మృతదేహం

కుభీర్: ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని లింగి గ్రామానికి చెందిన కె.గంగాధర్ (33) సోమవారం సాయంత్రం ఆటోలో సిమెంటు బస్తాలు వేసుకుని భైంసా నుంచి వస్తుండగా సాంవ్లి గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.